# బలగం BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ బుధవారం 30 ఏప్రిల్ 2025 | www.balagamtv.com | పేజీలు 4


## నేడు పదో తరగతి ఫలితాలు

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణ పదో తరగతి ఫలితాలు బుధవారం విడుదల కానున్నాయి. సీఎం రేవంత్ రెడ్డి ఫలితాలను విడుదల చేయనున్నారని విద్యాశాఖ అధికారికంగా ప్రకటించింది. ఈ సారి కొత్తగా మెమోలో విద్యార్థుల మార్కులతో పాటు సబ్జెక్టుల వారిగా గ్రేడ్స్ ప్రకటించనున్నారు. ఆ విధంగానే మార్క్స్ మెమోలు జారీ కానున్నాయి. మార్చి 21 నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు జరిగిన పది పరీక్షలకు 5 లక్షల మంది విద్యార్థులు హాజరయ్యారు. ఇక నుంచి పదో తరగతి మెమోల్లో సబ్జెక్టులవారీగా మార్కులు, గ్రేడ్లు ఇవ్వనున్నారు. జీపీఏ అనేది తీసివేయనున్నారు. మార్కుల మెమోలపై సబ్జెక్టులవారీగా రాత పరీక్షలు, ఇంటర్నల్ పరీక్షల మార్కులు, మొత్తం మార్కులు, గ్రేడు పొందుపరచనున్నారు. చివరగా విద్యార్థి పాసయ్యారా? ఫెయిల్ అయ్యారా? అనేది వివరంగా ఇస్తారు. ఇంకా బోధనేతర కార్యక్రమాల(కో కరిక్యులర్ యాక్టివిటీస్)లో స్టూడెంట్స్‌కు గ్రేడ్లు ఇస్తారు. వాల్యూ ఎడ్యుకేషన్ అండ్ లైఫ్ ఎడ్యుకేషన్, వర్క్ అండ్ కంప్యూటర్ ఎడ్యుకేషన్, ఆర్ట్ అండ్ కల్చరల్ ఎడ్యుకేషన్, ఫిజికల్ అండ్ హెల్త్ ఎడ్యుకేషన్ అనే నాలుగు కో కరిక్యులర్ యాక్టివిటీస్‌కు సంబంధించిన గ్రేడ్లు కూడా ముద్రించనున్నారు.



# సైన్యానికి పూర్తి స్వేచ్ఛ

- ఉగ్రవాదాన్ని అణచివేసే సర్వాధికారాలు వారికే
- తేదీ-సమయం సైన్యమే నిర్ణయిస్తుంది
- ప్రధాని మోడీ
- భద్రత, సన్నద్ధతపై ప్రధాని కీలక సమావేశం

**బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో**

ఉగ్రవాదాన్ని అణచివేసే విషయంలో సైన్యానికి పూర్తి స్వేచ్ఛ ఇస్తున్నామని ప్రధాన నరేంద్ర మోదీ అన్నారు. ఉగ్రవాదాన్ని తుదముట్టించడంపై దృఢ చిత్తంతో ఉన్నామని చెప్పారు. భారత సాయుధ దళాల సామర్థ్యంపై పూర్తి విశ్వాసం ఉందని తెలిపారు. కార్యాచరణ రూపొందించుకోవడంలోనూ సైన్యానికి పూర్తి స్వేచ్ఛ ఉంటుందని తెలిపారు. ఎప్పుడు, ఎలా స్పందించాలో నిర్ణయించే స్వేచ్ఛ సైన్యానికి ఉందన్నారు. పహల్గాం దాడి అనంతర పరిణామాలు, భద్రత, సన్నద్ధతపై ప్రధానమంత్రి తన నివాసంలో మంగళవారం సాయంత్రం కీలక సమావేశం నిర్వహించారు. సుమారు గంటన్నర సేపు ఈ సమావేశం జరిగింది. భారత రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ అనిల్ చౌహాన్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోబాల్, త్రివిధ దళాధిపతులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఉగ్రవాదాన్ని అణిచివేయడానికి భారత్ కృతనిశ్చయంతో ఉందని మరోసారి స్పష్టం చేశారు. హహల్గాం ఉగ్రదాడికి దీటుగా జవాబిస్తామని అన్నారు.

కాగా, పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో తీసుకుంటున్న చర్యలు, భద్రతపై సమీక్షించేందుకు హెూం మంత్రిత్వ శాఖ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం అత్యున్నత స్థాయి భద్రతా సమావేశం నిర్వహించారు. దీనికి హెూం శాఖ కార్యదర్శి గోవింద్ మోహన్ అధ్యక్షత వహించారు. సెంట్రల్ ఆర్మ్‌డ్ ఫోర్సెస్ (సీఏపీఎఫ్), బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ (బీఎస్ఎఫ్), సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సీఆర్‌పీఎఫ్), సహస్ర సీమ బల్ (ఎస్ఎస్‌బీ), ఇండో-టిబిటెన్ బోర్డర్ పోలీస్ (ఐటీబీపీ), నేషనల్ సెక్యూరిటీ గార్డ్ (ఎన్ఎస్‌జీ), అసోం రైఫిల్స్ డైరెక్టర్ జనరల్స్ ఈ సమావేశంలో పాల్గొన్నారు.

## నేడు మోడీ అధ్యక్షతన కీలక సమావేశం

**బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో**

జాతీయ భద్రతాంశాలపై విధాన నిర్ణయాలు తీసుకునే కేబినెట్ భద్రతా వ్యవహారాల కమిటీ బుధవారం కీలక సమావేశం జరుపనుంది. దీనికి ప్రధానమంత్రి అధ్యక్షత వహించనున్నారు. ఈ కీలక సమావేశానికి ముందుగానే మోదీ నివాసంలో త్రివిధ దళాధిపతులు, అజిత్ దోవల్ తదితరులు మంగళవారం సమావేశం కావడం ప్రాధాన్యత సంతరించుకుంది.

# హైకోర్టుకు ఐపీఎస్ అధికారులు

- భూదాన్ భూములపై సింగిల్ జడ్జి వెలువరించిన మధ్యంతర ఉత్తర్వులను రద్దు చేయాలని కోరుతూ అప్పీల్ పిటిషన్లు



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

భూదాన్ భూముల అంశంలో గతవారం హైకోర్టు సింగిల్ బెంచ్ ఉత్తర్వులు జారీ చేసిన విషయం తేలింది. ఈ వ్యవహారంపై పలువురు ఐపీఎస్ అధికారులు హైకోర్టును ఆశ్రయించారు. సింగిల్ బెంచ్ తీర్పుపై మహేశ్ భగవత్, స్వాతి లక్రా, సౌమ్యా మిశ్రా అప్పీల్ పిటిషన్ చేశారు. పిటిషనర్లు 74 మందిని ప్రతివాదులుగా చేర్చారు. ప్రతివాదుల జాబితాలో పలువురు ఐఏఎస్, ఐపీఎస్‌లు ఉన్నారు. ఈ నెల 24న 27 మంది అధికారుల భూములను నిషేధిత జాబితాలో పెట్టాలని హైకోర్టు తీర్పు ఇచ్చింది. సింగిల్ బెంచ్ జస్టిస్ భాస్కర్ రెడ్డి ఈ తీర్పును వెల్లడించారు.

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం నాగారంలోని సర్వే 182,194,195లో భూదాన్ భూముల విషయంలో కొంత కాలంగా వివాదం నడుస్తున్న విషయం తెలిసిందే. ఈ భూముల్లో అక్రమంగా లే అవుట్ చేసి అమ్మకాలు జరిపారు. భూదాన్ భూముల వ్యవహారంపై ఇటీవల హైకోర్టు విచారణ జరిగింది. ఉన్నతాధికారులకు పాత్రపై విచారణ జరిపించాలని హైకోర్టులో పిటీషన్ దాఖలైంది. 50 ఏళ్లకుపైగా సాగు చేసుకుంటున్న భూమిని కొందరు అధికారులు కబ్జా చేయాలని చూస్తున్నారని బిర్లా మహేశ్ పిటిషన్ వేశారు. రెవెన్యూ అధికారుల సాయంతో ఫోర్జరీ డాక్యుమెంట్లు సృష్టించి కుటుంబ సభ్యుల పేర్ల మీద భూములు బదలాయింపు చేశారని ఆరోపించారు. దీనిపై విచారణ జరిపిన న్యాయస్థానం.. ఈ భూముల వ్యవహారంలో మాజీ సీఎస్ లు, మాజీ డీజీపీలు, సీనియర్ ఐఏఎస్ లు, సీనియర్ పోలీసు అధికారుల పాత్రపై ఆగ్రహం వ్యక్తం చేసింది. సీబీఐ, ఈడీ విచారణ చేస్తేగాని వాస్తవాలు బయటికి వచ్చేలా లేవని హైకోర్టు వ్యాఖ్యలు చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు ఈడీ, సీబీఐలకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. అలాగే నవీన్‌మిట్టల్, మహేశ్ భగవత్, డాక్టర్ జ్ఞానముద్ర వంటి 26 మంది కీలక ప్రభుత్వ అధికారులకు నోటీసులు జారీ చేసింది. ఈ క్రమంలో తాజాగా సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పుపై ముగ్గురు ఐపీఎస్ అధికారులు హైకోర్టులో అప్పీలు చేశారు.

## ఆపరేషన్ 'కగార్'ను తక్షణం ఆపాలి

- మంత్రి సీతక్క



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

ఆదివాసీల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఆపరేషన్ 'కగార్'ను తక్షణమే నిలిపివేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. శాంతియుత వాతావరణం నెలకొల్పడమే ప్రభుత్వాల లక్ష్యంగా ఉండాలని సూచించారు. తెలంగాణ ఛత్తీస్‌ఘడ్ సరిహద్దుల్లో శాంతియుత వాతావరణం నెలకొనేలా చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. భారత్ బచావో సంస్థ ప్రతినిధులు గాదె ఇన్నయ్య, డాక్టర్ ఎమ్ ఎఫ్ గోపీనాథ్, జంజర్ల రమేష్ బాబు మంగళవారం ప్రజాభవన్‌లో మంత్రి సీతక్కతో భేటీ అయ్యారు. ఆపరేషన్ కగార్ ను నిలిపివేసేలా తన వంతు ప్రయత్నం చేయాలని వారు మంత్రి సీతక్కకు విజ్ఞప్తి చేశారు. తెలంగాణ ఛత్తీస్‌ఘడ్ సరిహద్దు కర్రెగుటల్లో నెలకొన్న ఉద్రిక్త వాతావరణాన్ని నిలువరించేలా చొరవ చూపాలని కోరారు. వేల సంఖ్యలో కేంద్ర బలగాలు కర్రెగుట్ట ప్రాంతాల్లో సంచరిస్తున్నటంతో ఆదివాసీలు భయాందోళనకు గురవుతున్నారని మంత్రికి తెలిపారు. ఆపరేషన్ కగార్‌ను తక్షణమే నిలిపివేయకపోతే పెద్ద ఎత్తున ప్రాణనష్టం జరిగే అవకాశం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన మంత్రి సీతక్క మాట్లాడుతూ మావోయిస్టుల శాంతి చర్చల ప్రతిపాదనకు కేంద్రం సానుకూలంగా స్పందించాలని కోరారు. రెండు వైపుల ప్రాణ నష్ట నివారణకు శాంతి చర్చలు మార్గం చూపుతాయని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. మధ్యభారతంలోని ఆదివాసి ప్రాంతాలు రాజ్యాంగంలోని షెడ్యూల్ 5 పరిధిలోకి వస్తాయని, అక్కడ ఆదివాసీలకు ప్రత్యేక హక్కులు, ప్రత్యేక పరిపాలన విధానాలు ఉంటాయని గుర్తు చేశారు. అందుకే ప్రభుత్వాలు రాజ్యాంగబద్ధంగా వ్యవహరించి వారి శాంతియుత జీవన విధానానికి ఎలాంటి ఆటంకాలు లేకుండా చూడాలని మంత్రి సీతక్క విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వాలు రాజ్యాంగానికి లోబడే వ్యవహరించాలి తప్ప బల ప్రయోగంతో కాకుండా, చర్చల ద్వారా సమస్య పరిష్కారం జరిగేలా కేంద్ర ప్రభుత్వం వ్యవహరించాలనీ ఆదివాసి బిడ్డగా కోరుకుంటున్నానని తెలిపారు. ఆపరేషన్ కగార్ తో ఆదివాసీలు తీవ్రభయాందోళనతో ఉన్నారని, వారికి తాను అండగా ఉంటానని తెలిపారు.

## మిస్ వరల్డ్ పోటీలకు
# కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలి

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

మిస్ వరల్డ్ 2025 పోటీకి కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మే 10 వ తేదీ నుంచి ప్రారంభం కానున్న మిస్ వరల్డ్ -2025 ఏర్పాట్లపై అధికారులతో ముఖ్యమంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. హైదరాబాద్‌లో 72 వ మిస్ వరల్డ్ (నిర్వహణకు సంబంధించి జరుగుతున్న ఏర్పాట్ల వివరాలను సమావేశంలో అధికారులు వివరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొనే అతిథులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చెప్పారు. కార్యక్రమంలో పాల్గొనడానికి విచ్చేసే అతిథుల కోసం ఎయిర్‌పోర్టు, వారు బస చేసే హెూటళ్లు, కార్యక్రమాలు నిర్వహించే ప్రాంతంలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి పోలీసు అధికారులను ఆదేశించారు.

తెలంగాణలోని చారిత్రక కట్టడాలు, పర్యాటక ప్రాంతాలను సందర్శించేందుకు అతిథుల ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని చెప్పారు. కార్యక్రమాలకు సంబంధించి విభాగాల వారిగా పర్యవేక్షణకు ప్రత్యేక అధికారులను నియమించాలని సూచించారు. నగరంలో పెండింగ్‌లో ఉన్న బ్యూటిఫికేషన్ పనులను త్వరగా పూర్తి చేయాలని, మిస్ వరల్డ్-2025 ప్రారంభమయ్యే నాటి నుంచి పూర్తయ్యే వరకు చేపట్టాల్సిన కార్యక్రమాలు, పూర్తి చేయాల్సిన పనులు, ఏర్పాట్లకు సంబంధించి పూర్తి స్థాయి ప్రణాళికను సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి గారు ఆదేశించారు.



# కాళేశ్వరం పాపం బీఆర్ఎస్ పాలకులదే



- దేశచరిత్రలోనే అతిపెద్ద తప్పిదం కాళేశ్వరం
- నిర్మాణంపై ఎన్డీఎస్ఏ నివేదిక చెప్పిందదే
- వారి హయాంలో నిర్మించారు.. వారి హయాంలోనే కూలిపోయింది
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

కాళేశ్వరం కూలిన పాపం ముమ్మాటికీ బి.ఆర్.ఎస్ పాలకులదే నని రాష్ట్ర నీటిపారుదల,పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి విరుచుకుపడ్డారు.చేసిన నిర్వాకం చాలదన్నట్లు అసలు విషయాన్ని దృష్టి మరల్చేందుకు ఆ పార్టీ అసత్య ప్రచారానికీ పూనుకుందని ఆయన మండిపడ్డారు.జాతీయ ప్రాజెక్టుల భద్రత సంస్థ వెల్లడించిన నివేదిక పై ఆయన తీవ్రంగా స్పందించారు. మంగళవారం సాయంత్రం డాక్టర్ బి.ఆర్.అంబెడ్కర్ సచివాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సహచర మంత్రులు పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ,లోకసభ సభ్యులు బలరాం నాయక్,శాసనసభ్యులు సత్యనారాయణ నీటిపారుదల శాఖా ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్,ఆర్ అండ్ ఆర్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి, ఇ.ఎన్.సి అనిల్ కుమార్ తదితరులతో కలసి ఆయన పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ స్వతంత్ర భారతదేశ చరిత్రలోనే కాళేశ్వరం కూలిన దురదృష్టకరసంఘటన నిలిచి పోతుందన్నారు. ఇంజినీరింగ్ వైఫల్యానికి ఇదో పరాకాష్ట అని ఆయన పేర్కొన్నారు. బి.ఆర్.ఎస్ ప్రభుత్వ హయంలో నిర్మించిన ప్రాజెక్టు వారి హయంలోనే కూలి పోయిందన్నారు. మెడిగడ్డ, సుందిళ్ళ బ్యారేజిల నిర్మాణాలు పూర్తిగా కూలి పోయాయని ఎన్.డి.ఎస్.ఏ నివేదికలో స్పష్టం అయ్యిందని ఆయన చెప్పారు.మాజీ ముఖ్యమంత్రి కేసిఆర్ అవగాహన రాహిత్యానికి నిదర్శనంగా ఆయన అభివర్ణించారు.

కాళేశ్వరం పేరుతో బి.ఆర్.ఎస్ పాలకులు చేసిన అప్పులు మూడు తరాలకు భారంగా పరిణమించగా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నం అయ్యిందన్నారు.నాటి ప్రభుత్వం భారీ వడ్డీలతో చేసిన రుణాలకు రాష్ట్ర ప్రభుత్వం సాలీనా 16,000 కోట్లు చెల్లించాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. ఇది రాష్ట్ర ఆర్థిక వ్యవస్థతో పాటు తెలంగాణా రైతాంగానికి మోయలేని భారంగా మారిందన్నారు.ఎన్.డి.ఎస్.ఏ నివేదిక ప్రకారం భద్రతా ప్రమాణాలు పాటించక పోగా ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించిన నిబంధనల ఉల్లంఘనకు పాల్పడ్డట్లు తెలిపోయిందన్నారు.

2019 నుండే నీళ్లు కారడం,పగుళ్లు ఏర్పడడం జరిగినా నాటి ప్రభుత్వం పట్టించుకోక పోవడంతోటే ఇప్పుడూ ఈ పరిస్థితి దాపురించి కోట్లాది ప్రజాధనం దుర్వినియోగం జరిగిందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు వాస్తవానికి తుమ్మిడిహట్టి దగ్గర నిర్మించాల్సిన ఈ ప్రాజెక్టును రీ డిజైన్ పేరుతో నిర్మించిన ప్రాజెక్టు ఏ రకంగా కూలిపోయిందన్న విషయాన్ని ప్రజలకు తెలియ జెప్పేందుకే మా యి ప్రయత్నమన్నారుప్రాజెక్టు నిర్మాణం కోసం కాకుండా పబ్లిసిటీ కోసం బి.ఆర్.యస్ పాలకులు తహ తహ లాడరని దాని ఫలితమే ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వానికి భారంగా పరిణమించిందన్నారు.రెండు టీ.యం.సి ల నీటి సామర్థ్యం తో రూపొందించ బడిన బ్యారేజీ లలో

మిగితా 2వ పేజీలో

## కొత్త డీజీపీ ఎవరో..?

- యూపీఎస్సీకి 8 మందితో జాబితా..

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్ర నూతన డీజీపీ ఎంపికపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఈ ఏడాది సెప్టెంబర్‌లో ప్రస్తుత డీజీపీ డా. జితేందర్ రిటైర్ కానున్నారు. ఈ నేపథ్యంలో కొత్త పోలీస్ బాస్ ఎవరనే దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొన్నది. ఇప్పటికే ఈ విషయమై కసరత్తు పూర్తిచేసిన రాష్ట్ర సర్కార్ ఎనిమిది మంది సీనియర్ అధికారుల పేర్లతో కూడిన జాబితాను యూపీఎస్సీకి పంపించింది. ఆ జాబితాలో నుంచి ముగ్గురి పేర్లను సర్కార్‌కు సూచించనుంది. రాష్ట్ర ప్రభుత్వం సీనియర్ ఐపీఎస్ అధికారులైన రవి గుప్తా (1990 బ్యాచ్), సీవీ ఆనంద్ (1991 బ్యాచ్), డా. జితేందర్ (1992 బ్యాచ్), ఆప్టే వినాయక్ ప్రభాకర్ (1994 బ్యాచ్), కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి (1994 బ్యాచ్), బి. శివధర్ రెడ్డి (1994 బ్యాచ్), డా. సౌమ్య మిశ్రా (1994 బ్యాచ్), శిఖా గోయల్ (1994 బ్యాచ్) పేర్లతో కూడిన జాబితాను యూపీఎస్సీకి పంపించింది. ఇందులో అర్హతల ఆధారంగా జాబితా నుంచి ముగ్గురి పేర్లను సూచిస్తూ తిరిగి రాష్ట్ర ప్రభుత్వానికి పంపనుంది. వారిలో ఒకరిని ప్రభుత్వం డీజీపీగా నియమించనుంది.

కాగా, ప్రస్తుతం డీజీపీగా కొనసాగుతున్న డా.జితేందర్ ఈ ఏడాది సెప్టెంబర్ 6న పదవీ విరమణ చేయనున్నారు. ఇక హైదరాబాద్ సీపీగా చేసిన ఐపీఎస్ అధికారి కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి ఈ ఏడాది ఆగస్టు 5న, రవి గుప్తా ఈ ఏడాది డిసెంబర్ 19న రిటైర్ కానున్నారు. అదేవిధంగా సీవీ ఆనంద్ 2028 జూన్, ఆప్టే వినాయక్ ప్రభాకర్ 2029 అక్టోబర్, బీ. శివధర్ రెడ్డి 2026 ఏప్రిల్ 28, డా. సౌమ్య మిశ్రా 2027 డిసెంబర్ 30, శిఖాగోయల్‌కు 2029 మార్చి వరకు సర్వీస్ ఉన్నది. అయితే ఆనంద్, శివధర్‌రెడ్డి, సౌమ్యామిశ్రాల్లో ఒకరికి డీజీపీ పదవి దక్కడం ఖాయమని పోలీసు వర్గాలు చెబుతున్నాయి. అన్ని సమీకరణాలు కుదిరితే రాష్ట్రంలో తొలి మహిళా డీజీపీగా సౌమ్యామిశ్రాకు అవకాశం లభించే అవకాశం ఉంది. అయితే, రాజకీయ, సంస్థాగత సమీకరణాల ప్రకారం చూస్తే సీవీ ఆనంద్, శివధర్‌రెడ్డిల్లో ఒకరికి డీజీపీ పదవి లభించే అవకాశం ఉన్నట్టు తెలుస్తున్నది.

# మంత్రి ఉత్తమ్‌ది అబద్ధాల ప్రచారం



- కొండను తవ్వి ఎలుకను పట్టారు
- అవినీతి జరిగిందని ఎన్డీఎస్ఏ చెప్పలేదు
- మంత్రి ఉత్తమ్‌ది వృథా ప్రయాసే
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వం.. ఇరిగేషన్ శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ పేరుతో అబద్ధాలు ప్రచారం చేస్తూ బీఆర్ఎస్ పై రాజకీయ బురద చల్లే ప్రయత్నం చేస్తున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి టీ హరీష్ రావు మండిపడ్డారు. మంత్రి ఉత్తమ్ ఇచ్చిన పవర్‌పాయింట్ ప్రజంటేషన్‌పై మంగళవారం ఆయన తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో కౌంటర్ ఇచ్చారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ పై మరోసారి ఉత్తమ్ సరిగా ప్రిపేరైనట్లుగా అనిపించలేదని, కొండను తవ్వి ఎలకను పట్టాడని సెటైర్లు వేశారు. ఎన్డీఎస్ఏ నివేదిక ఎన్డీఏ ప్రేరేపిత నివేదికగానే చూస్తున్నామని హరీశ్ స్పష్టం చేశారు.

పోలవరం రబ్బర్ డ్యామ్ కొట్టుకుపోతే ఎన్డీఎస్ఏ ఎందుకు స్పందించలేదని హరీశ్‌రావు ప్రశ్నించారు. కాళేశ్వరం పిల్లర్లు కూలితే మాత్రం వెంటనే హడావుడి చేశారని గుర్తు చేశారు. బీజేపీకి లబ్ధి చేకూర్చే విధంగా అసెంబ్లీ ఎన్నికలప్పుడు నాలుగు రోజుల్లోనే ప్రాథమిక నివేదిక, పార్లమెంటు ఎన్నికలప్పుడు

మిగితా 2వ పేజీలో

## విద్యుత్ చార్జీలు పెంచం

- ఈఆర్సీ చైర్మెన్ జస్టిస్ నాగార్జున్

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**



రాష్ట్రంలో విద్యుత్ చార్జీ లను ఈ ఏడాది పెంచబోమని తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి (ఈఆర్సీ) చైర్మెన్ జస్టిస్ దేవరాజు నాగార్జున్ ప్రకటిం చారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఈఆర్సీ కార్యాలయం లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన 2025-26 వార్షిక విద్యుత్ టారిఫ్‌ను ప్రకటించారు. ఉత్తర, దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థలు, సిరిసిల్లా కో ఆపరేటివ్ ఎలక్ట్రికల్ సప్లై సొసైటీ(సెస్)లు ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.65,849.74 కోట్ల ఆదాయ అవసరాలుంటాయని ప్రతిపాదించ గా, తాము శాస్త్రీయ పద్ధతిలో లెక్కించి రూ.58,628.09 కోట్లకు తగ్గించి ఆమోదించామన్నారు. ప్రస్తుత విద్యుత్ చార్జీలతో రూ.45,710.05 కోట్ల ఆదాయం మాత్రమే రానుండడంతో రూ.13,499.41 కోట్ల ఆదాయ లోటును ఎదుర్కోనున్నాయని తెలిపారు. రూ.13,499.41 కోట్ల విద్యుత్ సబ్సిడీలు ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడంతో ఈ ఏడాది విద్యుత్ చార్జీలను పెంచబోమని తెలిపారు. గతేడాదితో పోల్చితే విద్యుత్ సబ్సిడీ రూ.1999.89 కోట్లకు (17.4 శాతం) పెరిగిందన్నారు. రాష్ట్రంలో గత మార్చి 28న రికార్డు స్థాయిలో 17,162 మెగావాట్ల గరిష్ట విద్యుత్ డిమాండ్ ఏర్పడిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం 26,145 మెగావాట్ల విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు

మిగితా 2వ పేజీలో

# పింక్ వేసుకున్నవారికి ధరణిని చుట్టం చేశారు

- కడుపు ఎందుకు మండుతోంది కేసీఆర్...!
- ఇందిరమ్మ రాజ్యంలో పేదోడు సన్న బియ్యం తింటున్నందుకా లేక ఇందిరమ్మ ఇళ్లు పేదోళ్లకు ఇస్తున్నందుకా...?
- మేము తీసుకొచ్చిన భూ భారతి చట్టం పార్టీలతో సంబంధం లేకుండా అందరికీ న్యాయం చేస్తుంది
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**బలగం టీవి, హైదరాబాద్**

మొన్న వరంగల్ లో జరిగిన సభలో ఈ రాష్ట్రాన్ని చూస్తుంటే కడుపు మండుతోంది అని మాట్లాడారు కేసీఆర్ గారు... ఇందిరమ్మ రాజ్యంలో పేదోడు సన్న బియ్యం తింటున్నందుకా...! ఇందిరమ్మ ఇళ్లు పేదోళ్లకు ఇస్తున్నం దుకా...? లేక రైతు సోదరులకు రుణమాఫీ సక్రమంగా చేసినందుకా...? ఎందుకు అని అడుగుతున్నాను అని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. భూ భారతి - 2025 చట్టంపై నిర్వహిస్తున్న అవగాహన సదస్సుల్లో భాగంగా ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం సుర్దేపల్లిలో మంగళవారం నిర్వహించిన అవగాహన సదస్సులో మంత్రి పొంగులేటి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... గత ప్రభుత్వం అనాలోచితంగా ... ఆర్భాటంగా ధరణి చట్టాన్ని రూపొందించిందన్నారు. పింక్ కలర్ షర్ట్ వేసుకున్న వారందరికీ చట్టాన్ని చుట్టం చేశారని ఆరోపించారు. వారి హయంలో మూడున్నరేళ్ల పాటు ధరణి ఉన్నా కనీసం విధివిధానాలు రూపొందించలేదని విమర్శించారు. ధరణి చట్టం వల్ల ఎంతో మందికి నష్టం జరిగింది తప్ప లాభం జరగలేదని తెలిపారు. ఆ నష్టాన్ని , కష్టాన్ని పూడ్చేందుకే భూ భారతి చట్టాన్ని ఇందిరమ్మ రాజ్యంలో.... సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో తీసుకు రావడం జరిగిందన్నారు. 18 రాష్ట్రాల్లో ఉన్న రెవెన్యూ చట్టాలను క్షుణ్ణంగా పరిశీలించాక... ఆ చట్టాల్లో ఉన్న మంచి చెడులను అన్నింటినీ మేధావులు, రిటైర్డ్ అధికారులు, సీనియర్ కలెక్టర్లు తో చర్చించి పేదోళ్లకు న్యాయం జరిగే విధంగా భూ భారతి చట్టాన్ని తీసుకురావడం జరిగిందన్నారు. సమస్య ఏదైనా దానికి భూ భారతి తో శాశ్వత పరిష్కారం జరిగేలా ఈ చట్టం పనిచేస్తుందని తెలిపారు. గత ప్రభుత్వం మాదిరిగా కాంగ్రెస్ పార్టీకి చెందిన వారికి మాత్రమే చట్టం పనిచేయదని పార్టీలకు అతీతంగా ఏ పార్టీకి చెందిన వారైనా వారి సమస్యల్లో న్యాయం ఉంటే కచ్చితంగా వారికి ఈ చట్టం ద్వారా న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. మేము తీసుకొచ్చిన చట్టంలో విధి విధానాలను వందరోజుల్లోనే రూపొందించి వాటిని ప్రజలకు అంకితం చేసే కార్యక్రమం ఈ నెల 14వ తేదీన డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ జయంతి రోజున నిర్వహించడం జరిగిందన్నారు. ఈ చట్టం ప్రజలందరికీ చుట్టంలా పనిచేస్తుందని హామీ ఇచ్చారు.

# బస్టాప్‌లోకి దూసుకెళ్లిన బొలెరో

### ఇద్దరు నర్సింగ్ విద్యార్థులు మృతి




**బలగం టీవి, హైదరాబాద్**

గద్వాల జిల్లా కేంద్రంలో నర్సింగ్ కాలేజీ విద్యార్థినీలు కాలేజీ ముగిసిన తర్వాత హాస్టల్ కు వెళ్లేందుకు కొత్త హౌసింగ్ బోర్డ్ టర్నింగ్ బస్టాప్ దగ్గర బస్సు కోసం ఆగారు. అంతలో ఓ బొలెరో వాహనం వారిపై నుంచి దూసుకెళ్లింది. దీంతో మక్తల్ కు చెందిన మహేశ్వరి, వనపర్తికి చెందిన మనిషా స్పాట్ లోనే మృతి చెందారు. మరో ఇద్దరు విద్యార్థినీలతో పాటు మరో ఇద్దరు చిన్నారులకు కూడా తీవ్ర గాయాలయ్యాయి. వారిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రమాద ఘటనను తెలుసుకున్న వెంటనే ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, ఎస్పీ టి.శ్రీనివాసరావు, జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్ లు ప్రమాద సంఘటనను పరిశీలించారు. అనంతరం హాస్పిటల్ కు వెళ్లి చికిత్స పొందుతున్న వారిని పరామర్శించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# 52వ సీజేఐగా జస్టిస్ గవాయి నియామకం

**బలగం టీవి, హైదరాబాద్**



జస్టిస్ భూషణ్ రామ్‌కృష్ణ గవాయి మంగళవారం తదుపరి భారత ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ)గా నియుక్తుడయ్యారు. ప్రస్తుత సిజెఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా పదవీ విరమణ మరునాడు మే 14న ఆయన సిజెఐ కార్యాలయంలోకి ప్రవేశిస్తారు, జస్టిస్ గవాయిన 52వ సిజెఐగా నియమించినట్లు కేంద్ర న్యాయ మంత్రిత్వశాఖ ఒక ప్రకటన జారీ చేసింది. నిర్దేశిత ప్రక్రియ ప్రకారం, జస్టిస్ గవాయి పేరును సిజెఐ ఖన్నా ఈ నెల 16న కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేశారు. కాగా, జస్టిస్ గవాయి ఆరు నెలలే సిజెఐ పదవిలో ఉంటారు. 65 ఏళ్ల వయస్సు రాగానే ఆయన డిసెంబర్ 23న పదవీ విరమణ చేస్తారు. ఆయన సిజెఐ ఖన్నా తరువాత సుప్రీం కోర్టులో అత్యంత సీనియర్ న్యాయమూర్తి.

# కాళేశ్వరం పాపం బీఆర్ఎస్ పాలకులదే

(మొదటి పేజీ తరువాయి)

10 టి.యం.సి ల పై బడి నీటిని నిలువ చేసి పబ్లిసిటీ పబ్బం గడుపుకోవలని చూసిన బి.ఆర్.ఎస్ పాలకులకు వారి హయాంలోనే కూలిపోవడం వారి పరిపాలనా వైఫల్యాలను బహిర్గతం చేసిందన్నారు.తుమ్మిడి హట్టి వద్ద నీటి సౌలభ్యత లేదని బి.ఆర్.ఎస్ పాలకులు తప్పుడు ప్రచారం చేశారని అది ముమ్మాటికీ సత్యదూరమన్నారు.

రాష్ట్రానికి వేల కోట్లు నష్టపరిచడం ముమ్మాటికీ నేరంగా పరిగణించాలన్నారు.కాళేశ్వరం కూలడం అన్నది బి.ఆర్.ఎస్ పాలకుల వైఫల్యమే నని ఆయన తేల్చిచెప్పారు. ఇది ప్రకృతితో జరిగిన వైఫల్యం ఎంత మాత్రం కాదని ముమ్మాటికీ ఇది ప్రజలను మోసగించాలన్న దుర్బుద్ధితో నాటి పాలకులు రాజకీయ అహంకారంతో తీసుకున్న నిర్ణయమే నని ఆయన దుయ్యబట్టారు.అందుకు బాధ్యత వహించాల్సిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఎన్.డి.ఎస్.ఏ ను విమర్శించడం అంటే అది ఆయన అహంకారానికి దర్పం పడుతుందన్నారు.

ఎన్.డి.ఎస్.ఏ కాళేశ్వరం ప్రాజెక్టు పై వెలువరించిన నివేదికను చూస్తుంటే ఇది తెలంగాణా రాష్ట్రానికి జరిగిన తీరని అన్యాయమని తెలంగాణా ప్రజల మనోభావాలను గాయపర్చిన సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ఖమ్మం జిల్లాలో నిర్మించ తల పెట్టిన సీతారామ సాగర్ ప్రాజెక్టు అనుమతుల కోసం కేంద్ర జలశక్తి మంత్రిత్వశాఖను సంప్రదించినపుడు కాళేశ్వరం ప్రాజెక్టును దృష్టిలో పెట్టుకుని తిరస్కరించిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు.ఎన్ డి ఎస్ ఏ నివేదికను అనుసరించి బ్యారేజీలను పునరుద్ధరించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. సాంకేతిక నిపుణులతో చర్చించి భవిష్యత్ ప్రణాళికలు రూపొందించ నున్నట్లు ఆయన వెల్లడించారు.

ఇంతటి విపత్తుకు బాద్యులైన వారిపై చట్టపరంగా చర్యలు ఉంటాయన్నారు. రాష్ట్ర మంత్రివర్గంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారువాటర్ మేనేజ్మెంట్,ల్యాండ్ ట్రైనింగ్ అండ్ రిసెర్చ్ ఇనిస్టిట్యూట్ వంటి సాంకేతిక శిక్షణా సంస్థను బలోపేతం చేసే ఇంజినీర్లకు శిక్షణ ఇవ్వబోతున్నామన్నారు తుమ్మిడి హట్టిని ఆధారం చేసుకుని ప్రాణహిత-చేవెళ్ల పునరుద్ధరించే అంశంపై ఆయన స్పందిస్తూ నీటిపారుదల సలహాదారు ఆదిత్యనాథ్ దాస్ అధ్యయనం చేస్తున్నారని ఆయన తెలిపారు.

# మంత్రి ఉత్తమ్‌మీది అబద్ధాల ప్రచారం

(మొదటి పేజీ తరువాయి)

మధ్యంతర నివేదిక ఇచ్చిన ఎన్డీఎస్ఏ.. బీఆర్ఎస్ రజతోత్సవ సభ వేళ తుది నివేదిక ఇవ్వడం వెనుక రాజకీయం ఉందని ఆరోపించారు. ఎన్డీఎస్ఏ బిల్లుకు బీఆర్ఎస్ ఎంపీలు మద్దతు ఇచ్చిన మాట వాస్తవమేనని, అదే సమయంలో దానిని కాంగ్రెస్ ఆనాడు వ్యతిరేకించిందని గుర్తు చేశారు. అది మర్చిపోయి.. ఇప్పుడు బీఆరెస్‌ను నిందించేందుకు ఎన్డీఎస్ఏ నివేదికను బైబిల్, ఖురాన్, భగవద్గీత అన్నట్లుగా ఉత్తమ్ మాట్లాడుతున్నాడని విమర్శించారు. ఏడవ బ్లాక్‌ను పునర్నిర్మించి, మేడిగడ్డ బ్యారేజీని వాడుకోవచ్చని ఎన్డీఎస్ఏ చెప్పిన విషయాన్ని ఎందుకు ఉత్తమ్ చెప్పడం లేదని నిలదీశారు. దానిని వదిలేసి లక్ష కోట్లు నష్టమైందని ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నివేదికలో ఎక్కడా ప్రాజెక్టు పనికి రాదని చెప్పలేదన్నారు. ఖర్చు పెట్టిందే 96కోట్లయితే లక్షల కోట్లు నష్టమైందంటున్నారన్నారని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా మీ రాజకీయాల కోసం రైతుల గొంతు కోయకుండా వెంటనే మేడిగడ్డ రిస్టోర్ చేసి సాగు, తాగునీటి అవసరాలకు వాడుకోవాలని కోరారు.

మహారాష్ట్ర సీఎం ఫడ్నవీస్‌తో చర్చల సందర్భంగా ఆయన ఒప్పుకోకపోవడంతోనే తుమ్మిడి హట్టి బదులు మేడిగడ్డకు మార్చినట్టు చెప్పారు. తుమ్మిడి హట్టి వద్ద 160 టీఎంసీలు నీళ్లు లేవని సీడబ్ల్యూసీ లెటర్ ఇచ్చిందని గుర్తు చేశారు. ఈ పరిస్థితుల్లో గోదావరి జలాల హక్కులను సద్వినియోగం చేసుకునేందుకు 280 టీఎంసీలు అందుబాటులో ఉండే చోట సీడబ్ల్యూసీ అనుమతితో కేంద్ర సంస్థ వ్యాప్కోస్ నివేదిక మేరకు మేడిగడ్డ వద్ద కట్టామన్నారు. దీన్ని ఉత్తమ్ తప్పుదోవ పట్టిస్తున్నారని హరీష్ రావు మండిపడ్డారు. ఎన్డీఎస్ఏ నివేదికపై కేబినెట్ లో కాకపోతే ఏఐసీసీలో చర్చించుకోవచ్చని..కాని ప్రాజెక్టును వెంటనే పునరుద్ధరించాలని కోరారు. కాంగ్రెస్ పాలనలో ఎస్సెల్బీసీ ఎస్ ఎల్బీసీ కుప్పకూలిందని, దానికంటే పెద్ద డిజాస్టస్ ఇంకేముందని ప్రశ్నించారు. కనీసం చనిపోయిన వారి మృతదేహాలను కూడి బయటకు తీయలేదన్నారు. సుంకిశాల ప్రాజెక్టు కూలిపోయిందని, పెద్దవాగు కొట్టుకపోయింది.. వట్టెం పంపు హౌస్ మునిగిపోయిందని చెబుతూ.. మీరు సుద్ధపూస లెక్క మాట్లడటం ఏమిటని మంత్రి ఉత్తమ్‌పై హరీశ్‌రావు మండిపడ్డారు.

# విద్యుత్ చార్జీలు పెంచం

(మొదటి పేజీ తరువాయి)

చేసుకుందనీ, అందులో 20,845 మెగావాట్ల సరఫరా సామర్థ్యాన్ని కలిగి ఉందన్నారు. 2033-34 నాటికి రాష్ట్రంలో విద్యుత్ కొరత ఏర్పడనుండడంతోనే సౌర విద్యుత్ కొనుగోలు ఒప్పందాలకు అనుమతించామని ఆయన వివరించారు. ట్రాన్స్‌ఫార్మర్లకు సకాలంలో మరమ్మతులు చేయకపోవడంతో విద్యుద్ఘాతంతో రైతులు, యువకులు మరణిస్తున్నారనే ఫిర్యాదులు అందాయని అన్నారు. మృతుల కుటుంబాలకు రూ.5లక్షల పరిహారం ఇస్తుండగా, ఆ పరిహారం పెంపుపై త్వరలో నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.

రాష్ట్రంలోని డిస్కంలు తీవ్ర నష్టాల్లో ఉన్నాయని జస్టిస్ నాగార్జున్ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీ మేరకు డిస్కంల ఆదాయ లోటును ఈఆర్సీ తగ్గించి చూపుతోందని అనడంలో వాస్తవం లేదని తెలిపారు. ఎంత ఆదాయ లోటుందో ఆ మేరకు సబ్సిడీ ఇచ్చేందుకు ప్రభుత్వం అంగీకరించిందని వివరించారు. ఈఆర్సీ ఆమోదించిన ఆదాయ లోటు అంచనాలతో పోల్చితే వాస్తవ ఆదాయ లోటు అధికంగా ఉండడంతో డిస్కంలు నష్టాలను మూటగట్టుకుంటున్నాయని అభిప్రాయపడ్డారు. డిస్కంల నష్టాలను పూడ్చుకునేందుకు విద్యుత్ చార్జీలు పెంచడమే పరిష్కారమని పేర్కొన్నారు. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై భారం వేయలేమని చెప్పారు. ఆర్థిక పునర్వ్యవస్థీకరణ కోసం కేంద్రం తెచ్చిన ఆర్డీఎస్ఎస్ పథకంలో చేరిన తర్వాత వ్యవసాయ ఫీడర్లకు మీటర్లు పెడతామంటూ డిస్కంలు హామీ ఇచ్చాయని అన్నారు.. డిస్కంల డిస్ట్రిబ్యూషన్ బిజినెస్‌కి సంబంధించి రూ.685.78 కోట్లు, ట్రాన్స్‌కోకి చెందిన ట్రాన్స్‌మిషన్ బిజినెస్‌కి సంబంధించి రూ.1608 కోట్లను ట్రూడౌన్ చేశామని వివరించారు. డిస్కంల విలింగ్ చార్జీలు, డిస్ట్రిబ్యూషన్ బిజినెస్, ట్రాన్స్‌కో తదితర ఎనిమిది పిటిషన్లను పరిష్కరిస్తూ ఆ మేరకు వేర్వేరు ఉత్తర్వులను జారీ చేశామని పేర్కొన్నారు. యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రంలోని 800 మెగావాట్ల రెండో యూనిట్ అందుబాటులోకి రాగా, మొదటి యూనిట్ ఆగస్టు, 3వ యూనిట్ నవంబర్, 4వ యూనిట్ అక్టోబర్, 5వ యూనిట్ వచ్చే ఏడాది జూన్‌లో అందుబాటులో వస్తాయని తెలిపారు.

# ఆయిల్ ట్యాంకర్ పేలి ఇద్దరు మృతి

**బలగం టీవి, హైదరాబాద్**

నైరుతి పాకిస్థాన్ దుమ్ము రోడ్డులో లీకయిన ట్యాంకర్‌కు నిప్పంటుకుని పేలిపోయిన ఘటనలో ఇద్దరు చనిపోగా, 56 మంది గాయపడ్డారు. ఈ ఘటన మంగళవారం చోటు చేసుకుంది. వివరాలలోకి వెళితే.. బలూచిస్థాన్ ప్రాంతంలోని నౌష్కిలో అగ్నిమాపక దళం వారు మంటలను ఆర్పుతుండగా ట్యాంకర్ నుండి ఆయిల్ లీకై పేలుడు సంభవించిందని అక్కడి స్థానిక పోలీస్ అధికారి తెలిపారు. ఈ ఘటనలో ట్యాంకర్ డ్రైవర్, మరొక వ్యక్తి చనిపోగా, మరికొంత మంది తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిని స్థానిక పోలీసులు చికిత్స నిమిత్తం కరాచీలోని ఓ ఆసుపత్రికి తరలించారు. బలూచిస్థాన్ ముఖ్యమంత్రి సర్ఫరాజ్ బుగ్తి ఖ్వెట్టాలోని సివిల్ హాస్పిటల్‌కు చేరుకుని బాధితులను పరామర్శించారు.

## ధాన్యం విక్రయించిన తర్వాత

# రైతులు ఆందోళన చెందవద్దు..

**-సేకరించిన ధాన్యం తరలింపునకు ప్రత్యేక చర్యలు..**

**- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**

**బలగం టీవీ,రాజన్న సిరిసిల్ల**

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసిన గ్రామాల్లో వెంట వెంటనే ధాన్యం కొనుగోలు చేయాలని,రాత్రి వరకు కూడా రైతుల నుంచి ధాన్యం సేకరించాలని ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు.జిల్లాలో యాసంగి సీజన్లో ధాన్యం సేకరణ తరలింపు తదితర అంశాలపై ఆయా శాఖల అధికారులతో మంగళవారం జిల్లా సమీకృత కార్యాల యలో సమావేశం నిర్వహించగా, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కలెక్టర్ సందీప్ కుమార్ ఝా హాజరై సమీక్షించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్ మాట్లాడుతూ రైతుల సంక్షేమమే తమ ప్రభుత్వ లక్ష్యమని,రైతులు ధాన్యం విక్రయించడంలో ఎలాంటి ఇబ్బందులు పడవద్దని సీఎం రేవంత్ రెడ్డి, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారని అన్నారు. కొనుగోలు కేంద్రాల్లో సేకరించిన ధాన్యాన్ని తరలించేందుకు ఒప్పందం చేసుకున్న లారీల కాంట్రాక్టర్ జిల్లాలోని ఐదు రూట్లలో దాదాపు 500 లారీలు సమకూర్చాల్సి ఉందని,సదరు కాంట్రాక్టర్ 180 లారీల వరకు సమకూర్చడంతో ధాన్యం తరలింపులో ఇబ్బందులు ఎదురవుతున్నాయని అన్నారు. ఇప్పటికిప్పుడు ధాన్యం తరలింపునకు ప్రత్యామ్నాయంగా జిల్లాలోని వంద లారీలను అలాగే రైస్ మిల్లర్ల పరిధిలోని 50 లారీలను సిద్ధంగా ఉంచామని అన్నారు.

వేములవాడ నియోజకవర్గంలోని రుద్రంగి, చందుర్తి, కోనరావుపేట, అలాగే బోయిన్పల్లి మండలం ఇల్లంతకుంట తదితర మండలాల్లో సేకరించిన ధాన్యాన్ని వెంట వెంటనే తరలించాలని ఆదేశాలు జారీ చేశారు. కూలీల



ఇబ్బంది లేకుండా కూడా చర్యలు తీసుకోవాలని,వేములవాడ నియోజకవర్గంలోని 74 కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు చేసి, నేటి నుండి వెంట వెంటనే తరలించాలని అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులు ధాన్యం విక్రయించిన తర్వాత ఆందోళన చెందవద్దని, రైస్ మిల్లర్లకు ధాన్యం తరలింపు విషయం అధికారులు చూసుకుంటారని ఈ విషయంలో రైతులు ఎలాంటి ఆందోళన చేత వద్దని అన్నారు. రుద్రంగి పరిధిలో. కొనుగోలు చేసిన ధాన్యాన్ని అలాట్ చేసిన రైస్ మిల్లులకు తరలిస్తూనే,స్థానిక ఏఎంసి గోడౌన్లో కూడా నిల్వ చేయాలని అన్నారు. ఇంకా జిల్లాలోని రైస్ మిల్లర్లు బ్యాంక్ గ్యారంటీ ఇచ్చేందుకు ముందుకు రాకపోతే అపరాల్ పార్క్ లోని గోదాములు, ఏఎంసీ గోదాంలో దాన్యం విలువ చేసేందుకు కలెక్టర్ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశారని అన్నారు.

జిల్లాలోని పలు ప్రాంతాల్లో సన్న వడ్లు పండించిన రైతులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు సేకరిస్తుందని అన్నారు. రైతులు కొనుగోలు కేంద్రాల్లోని విక్రయించి మద్దతు ధరతో పాటుగా బోనస్ కూడా పొందాలని అన్నారు.ఈ సమీక్ష సమావేశంలో డిఆర్డిఓ శేషాద్రి, డీ సి ఎస్ ఓ వసంత లక్ష్మి, డిఎం రజిత, జిల్లా వ్యవసాయ అధికారి అప్జలీ బేగం, డిసిఓ రామకృష్ణ, డి టి వో లక్ష్మణ్, ఆయా మండలాల వ్యవసాయ అధికారులు, ఐకెపి ఏ.పి.ఎం.లు తదితర అధికారులు పాల్గొన్నారు.

# రైతును రాజుగా చేయడమే ప్రభుత్వ లక్ష్యం..

**-భూ భారతి చట్టం రైతులకు చుట్టం**

**-ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**

**బలగం టీవీ, సిరిసిల్ల**



రైతును రాజుగా చేయడమే లక్ష్యముగా ప్రజా ప్రభుత్వం ముందుకు వెళుతుందని,భూ భారతి చట్టం రైతులకు చుట్టమని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన భూ భారతి (రికార్డు ఆఫ్ రైట్స్ ఇన్ ల్యాండ్) చట్టం 2025పై అవగాహన సదస్సును మంగళవారం కోనరావుపేట మండలం నిజామాబాద్ లో నిర్వహించగా, ముఖ్యఅతిథిగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తో కలసి హాజరయ్యారు. ఈ సందర్భంగా విప్ అది శ్రీనివాస్ మాట్లాడుతూ భూ భారతి చట్టం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఇతర మంత్రుల సమక్షంలో చట్ట ఏర్పాటు చేసుకోవడం జరిగిందని అన్నారు. కొన్ని రోజులుగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సమక్షంలో ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించడం జరుగుతుందని అన్నారు.కొన్ని సంవత్సరాలుగా యాజమాన్య హక్కులు ఉన్న కని వాటిని మనం పొందలేక పోయామని అన్నారు.

గతంలో అసైన్ మెంట్ కమిటి ఉండేదని, ధరణి చట్టం తో దానిని తొలగించారని,ధరణి చట్టానికి సరైన ప్రణాళికలు లేకుండా రూపొనిందించారని అన్నారు. తాత ముత్తాతలు కొన్న భూమిలును ధరణి వల్ల మళ్ళీ పాత వాళ్ళకే పట్ట ఉండటంతో రైతులు చాల ఇబ్బందులు ఎదురుకొన్నారని,పేద వారికి ఉపయోగపడే ప్రతి ఒక్క పథకాన్ని అమలు చేసింది తమ ప్రభుత్వమని అన్నారు.

ప్రజా ప్రభుత్వంలో మహిళా తల్లులకు ఉచిత బస్సు ప్రయాణం,ఉచిత విద్యుత్,500 సిలిండర్లు సరఫరా చేయడం జరుగుతుందని అన్నారు.

దేశంలో ఎక్కడ లేని విధంగా పేద ప్రజలకు సన్న బియ్యం పంపిణీ చేయడం జరుగుతుందని, రైతులకు ఏక కాలంలో 2 లక్షల వరకు రుణమాఫీ చేయడం జరిగిందని, దశాబ్దాల కల ఎస్సి వర్గీకరణ అమలు చేయడం జరిగిందని అన్నారు. ఇంకా కొన్ని కార్యక్రమలను అమలు చేసుకోవాలి త్వరలోనే వాటిని అమలు చేసుకుందామని, యువత కు ఉపాధి అవకాశాలు కల్పించడం కోసం రాజీవ్ యువ వికాసం అమలు చేస్తున్నామని, దీని ద్వార సుమారు 5 లక్షల మంది యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని అన్నారు.ఈ కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ ఎల్లయ్య, తహసిల్దార్ వరలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

# ఆలయ రోడ్డు విస్తరణ భూసేకరణ సర్వే సకాలంలో చేయాలి

**-కలెక్టర్ సందీప్ కుమార్ ఝ**

**బలగం టీవీ, వేములవాడ**

ఆలయ రోడ్డు విస్తరణ భూసేకరణ నిమిత్తం సర్వే సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝ అన్నారు. మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో వేములవాడ ఆలయ రొడ్డు విస్తరణ, భూ సేకరణ పనుల పై కలెక్టర్ సందీప్ కుమార్ ఝ సంబంధిత అధికారులతో రివ్యూ నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మాట్లాడుతూ వేములవాడ ఆలయం వద్ద రోడ్డు విస్తరణ పనులకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని, వీటికి అవసరమైన భూసేకరణ చేసేందుకు తొలగించాల్సిన నిర్మాణాల ప్రతిపాదనలను 4 టీం ల ద్వారా సర్వే చేసి అందించాలని సంబంధిత ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు.

భూ సేకరణ చట్టం 2013 సెక్షన్ 12 ప్రకారం భూసేకరణ నిమిత్తం సర్వే చేసే పూర్తి అధికారాలు మనకు ఉన్నాయనిఅన్నారు.



చట్టంపై అధికారులు అవగాహన పెంచుకొని ఏప్రిల్ చివరినాటికి సర్వే పూర్తి చేసి ప్రతిపాదనలు భూ సేకరణ తయారు చేయాలని అన్నారు.ఈ సమావేశంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాధ భాయి, వేములవాడ మున్సిపల్ కమిషనర్ అన్వేష్, ఈ ఈ ఆర్ అండ్ బి రమణయ్య, ఈ ఈ మిషన్ భగీరథ జానకి, ఫారెస్ట్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.




# సాంకేతికత ఆధారంగా అధికారులు వృత్తి నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాలి

**-సైబర్ నిందుతులకు శిక్ష పడటంలో డిజిటల్ సాక్ష్యాధారాల సేకరణ కీలకం.**

**- ఎస్పీ మహేష్ బి.గితే..**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

పోలీస్ అధికారులు, సిబ్బంది నిత్య విద్యార్థిగా ఉంటూ ఎప్పటికప్పుడు సమాజంలో జరిగే మోసాలపై అవగాహన పెంపొందించుకోవాలని ఎస్పీ మహేష్ బి.గితే అన్నారు. మంగళవారం సెంట్రల్ డిటెక్టివ్ ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్ హైదరాబాద్,రాజన్న సిరిసిల్ల జిల్లా పోలీస్ సంయుక్తంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో కరీంనగర్, సిరిసిల్ల, జగిత్యాల, సిద్ధిపేట జిల్లాల పోలీస్ అధికారులకు,సిబ్బందికి సైబర్ నిపుణులు ఆధ్వర్యంలో రెండు రోజుల 'సైబర్ క్రైమ్ ఇన్వెస్టిగేషన్ పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్పీ మహేష్ బి. గితే హాజరై మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో ప్రజలు ఎక్కువగా సైబర్ నేరాల బారిన పడుతున్న నేపథ్యంలో సిబ్బంది, అధికారులు సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకుంటు సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేయాలన్నారు.సైబర్ మోసాలకు సోషల్ మీడియా ప్లాట్ ఫామ్ ను దుర్వినియోగం చేస్తూ మోసాలకు పాల్పడే నేరగాళ్ళకు శిక్ష పడటంతో డిజిటల్ సాక్ష్యాధారాలు ప్రధాన పత్ర పోషిస్తాయన్నారు. సైబర్ నేరం జరిగినప్పుడు పిర్యాదు నమోదు నుండి డిజిటల్ ఆధారాలు సేకరణ, విశ్లేషణ మొదలగు అంశాలపై సైబర్ నిపుణులు ఇచ్చిన శిక్షణ సద్వినియోగం చేసుకొని సైబర్ నేరస్థులకి శిక్షలు పడేవిధంగా కృషి చేయాలన్నారు. సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1930 టోల్ ఫ్రీ నెంబర్ ద్వారా ఫిర్యాదు చేసే విధంగా పోలీస్ అధికారులు, సిబ్బంది ఆయా పోలీస్ స్టేషన్లలో ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని అన్నారు.భౌతిక పోలీసింగ్ తో పాటు డిజిటల్ పోలీసింగ్ పై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ చంద్రయ్య, , సీడీటిఐ కోర్స్ కోఆర్డినేటర్ డీస్పీ రాజ్ కుమార్ ,సీడీటిఐ కోర్స్ కోఆర్డినేటర్ భీమకృష్ణ నాయక్,ఇంటర్నేషనల్ సైబర్ ఎక్స్పర్ట్ అఖిలేష్ రావు కండూరి ,పోలీస్ అధికారులు,,సిబ్బంది పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపై

# అవగాహన కార్యక్రమాలు చేపట్టాలి...

**-ఎస్పీ మహేష్ బి గితే**

**బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట**



మత్తు పదార్థాలు,సైబర్ నేరాలపై గ్రామాల్లో ముమ్మరంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ఎస్పీ మహేష్ బి గితే అన్నారు.మంగళవారం ఎల్లారెడ్డిపేట,వీర్నపల్లి పోలీస్ స్టేషన్లను ఎస్పీ మహేష్ బి గితే సందర్శించినారు.స్టేషన్ల పరిసరాలు,పలు స్టేషన్ రికార్డులు,పోలీస్ స్టేషన్ల పరిధిలోని గ్రామాల వివరాలతో పాటు గతంలో జరిగిన సంఘటనల వివరాలు,స్టేషన్ల పరిధిలో నమోదు అవుతున్న కేసుల వివరాలు, పెండింగ్ కేసుల వివరాలతో పాటుగా సిబ్బంది నిర్వహించే విధుల వివరాలు అడిగి తెలుసుకున్నారు.అనంతరం ఎస్పీ మహేష్ బి గితే మాట్లాడుతూ పోలీస్ స్టేషన్ కు వచ్చే బాధితుల ఫిర్యారుదలపై తక్షణమే స్పందించి వారి సమస్యను తెలుసుకొని వారికీ భరోసా నమ్మకం కల్పించాలని, చట్టపరిధిలో సమస్యలు వరిష్కరించాలనిఅన్నారు. పెట్రోలింగ్ సమయంలో తప్పని సరిగా రౌడీ,హిస్టరీ షీటర్లతో పాటు అనుమానిత వ్యక్తుల తనిఖీ చేస్తూ వారి ప్రస్తుత స్థితిగతులపై అరా తీయాలని,మత్తు పదార్ధాలపై, సైబర్ నేరాలపై ముమ్మరంగా గ్రామాల్లో ప్రజలకు, యువతకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు.పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి అక్రమ రవాణా, సేవించడం వంటి వాటిపై ,అసాంఘిక కార్యకలాపాలపై నిరంతరం నిఘా ఉంచుతూ కట్టడి చేయాలన్నారు.అధికారులకు,సిబ్బందికి ఏమైనా సమస్యలు ఉన్నాయా అని, ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకొని రావాలి అని సూచించారు. ఈ కార్యక్రమం లో డిఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి, సి.ఐ శ్రీనివాస్,ఎస్.ఐలు రమాకాంత్, ఎల్లగౌడ్, సిబ్బంది ఉన్నారు.

# బీజేపీ మండల అధ్యక్షుడు పదవి అగ్రవర్ణాలకేనా...?

**బీజేపీ ఎల్లారెడ్డిపేట మండల అధ్యక్ష పదవిపై అంతర్గత కుమ్ములాట..?**

**బలగం టీవీ, ఎల్లారెడ్డి పేట**

ఎల్లారెడ్డిపేట మండల బిజెపి అధ్యక్ష పదవి మొదటి నుంచి అగ్రవర్ణాలకేనని చర్చించుకుంటున్నారు. గత 20 సంవత్సరాలుగా కాల వ్యవధిలో ఓసీలకు ఇచ్చి ఒక బీసీ కి మాత్రమే ఒకే ఒక ఛాన్స్ ఇచ్చారు. మళ్లీ ఇప్పుడు కూడా ఓసికి అధ్యక్ష పదవి ఇవ్వడం పట్ల బీజేపీలో అంతర్గత కుమ్ములాట జరుగుతున్నట్లు సమాచారం. గత మూడు దశలుగా ఓసి లే అధ్యక్ష పదవి దక్కించుకోవడం పట్ల పార్టీ నాయకులలో విమర్శలు మొదలైనట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా ఒకే గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులకు మండల అధ్యక్ష పదవిని ఇవ్వడం పట్ల రహస్యం ఏంటని చర్చలు జరుగుతున్నాయి. ఎల్లారెడ్డిపేట మండల అధ్యక్షుడు పదవిపై జిల్లా అధ్యక్షుడి పైన విమర్శలు వెలువెత్తుతునట్లు తెలుస్తుంది.

# దక్షిణాఫ్రికాపై భారత్ విజయం

- ముక్కోణపు సిరీస్‌లో భారత్ మహిళల జట్టుకు రెండో విక్టరీ
- ఐదు వికెట్లు తీసి మ్యాచ్ మలుపు తిప్పిన స్నేహ్ రానా

**బలగం టీవీ, కొలంబో**

శ్రీలంక వేదికగా జరుగుతున్న ముక్కోణపు వన్డే సిరీస్‌లో భారత అమ్మాయిలు జోరు చూపిస్తున్నారు. తొలి పోరులో శ్రీలంకను





చిత్తుగా ఓడించిన టీమిండియా ఈసారి దక్షిణాఫ్రికాను ఓడించారు. 15 పరుగుల తేడాతో సఫారీలపై గెలుపొందారు.

భారత్ తొలుత బ్యాటింగ్ చేయగా ఓపెనర్ ప్రతీకా రావల్(74) అర్ధ శతకంతో శుభారంభం ఇవ్వగా.. జెమీమా రోడ్రిగ్స్(41), కెప్టెన్ హర్మన్‌ప్రీత్(41)లు దంచేశారు. ఆఖర్లో రీచా ఘోష్(24) మెరుపులతో భారత్ నిర్ణీత ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 276 పరుగులు చేసింది.

అనంతరం ఛేదనలో దక్షిణాఫ్రికా ఓపెనర్ తంజిమ్ బ్రిట్స్(109) సెంచరీతో చెలరేగి జట్టును గెలుపు వాకిట నిలిపింది. ఓపెనర్ లారా వొల్వార్డ్(43) కూడా విజృంభించారు అయితే.. లారాను ఔట్ చేసిన దీప్తి శర్మ బ్రేకిచ్చింది. ఆ తర్వాత బంతి అందుకున్న స్నేహ్ రానా (5-43) కీలక వికెట్లు తీసి మ్యాచ్‌ను మలుపుతిప్పింది. దాంతో, ప్రత్యర్థిని భారత్ 261 పరుగులకే కట్టడి చేసింది. తన అద్భుత ప్రదర్శనతో జట్టుకు విజయాన్నందించిన రానా ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా ఎంపికైంది. భారత బౌలర్లలో శ్రీచరణి, దీప్తి శర్మ, అరుంధతీ రెడ్డిలు తలా ఒక వికెట్ల తీశారు.

# వైభవ్ సూర్యవంశీకి బిహార్ సీఎం రివార్డు

**బలగం టీవీ, హైదరాబాద్**

ఐపీఎల్‌లో రికార్డు సెంచరీతో చరిత్ర సృష్టించిన వైభవ్ సూర్యవం శీకి బిహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ అభినందనలు తెలిపారు. తమ రాష్ట్రం ఖ్యాతిని యావత్ ప్రపంచం విస్తరించిన వైభవ్‌కు ప్రైజ్‌మనీ ప్రకటించారు. చిన్నవయసులోనే రికార్డులు బద్ధలు కొట్టిన అతడికి రూ.10 లక్షల రికార్డు ఇస్తామని సీఎం వెల్లడించారు. 'వైభవ్ సూర్యవంశీకి అభినందనలు. ఐపీఎల్ చరిత్రలో రికార్డు సెంచరీ బాదిన అతడికి నా శు భాకాంక్షలు తెలియజేస్తున్నా. తన శ్రమ, ప్రతిభతో ఐపీఎల్లో సంచనంగా మారాడు. భారత క్రికెట్ జట్టుకు భవిష్యత్ తారగా ఆవతరించాడు. ఐపీఎల్‌లో వైభవ్ ప్రదర్శన పట్ల మేమంతా చాలా సంతోషంగా ఉన్నాం' అని నితీశ్ ప్రకటనలో తెలిపారు.





## 2026 జూన్ 25న ఎన్టీఆర్-ప్రశాంత్ నీల్ మూవీ

**బలగం టీవీ, హైదరాబాద్**

యంగ్ టైగర్ ఎన్టీఆర్ హీరోగా కేజీఎఫ్, సలార్ చిత్రాల డైరెక్టర్ ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో ఒక సినిమా తెరకెక్కుతోన్న విషయం తెలిసిందే.ఈ భారీ ప్రాజెక్ట్‌ను మైత్రీ మూవీ మేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ప్రస్తుతం ఈ సినిమా శరవేగంగా షూటింగ్ జరుపుకుంటోంది. అయితే, తాజాగా ఈ సినిమా విడుదల తేదీని ప్రకటించారు. ఈ సినిమాను వచ్చే ఏడాది జూన్ 25న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయబోతున్నట్లు మేకర్స్ వెల్లడించారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా ఆసక్తికర పోస్టర్‌ను పంచుకున్నారు. ఇక, పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా రూపొందనున్న ఈ సినిమాకు రవి బస్రూర్ సంగీతం అందించనున్నారు. ఈ సినిమాకు 'డ్రాగన్' అనే టైటిల్ ప్రచారంలో ఉంది.

## కిష్కింధపురి' గ్లింప్స్ విడుదల

**బలగం టీవీ, హైదరాబాద్**

బెల్లంకొండ సాయి శ్రీనివాస్ హీరోగా నటిస్తున్న ఫాంటసీ హారర్ థ్రిల్లర్ కిష్కింధపురి. అనుపమ పరమేశ్వరన్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రానికి కౌశిక్ దర్శకత్వం వహిస్తున్నారు. షైన్ స్క్రీన్ బ్యానర్‌పై సాహు గారపాటి ఈ సినిమాను నిర్మింస్తుండగా.. తాజాగా ఫస్ట్ గ్లింప్స్‌ను విడుదల చేసింది చిత్రయూనిట్. గ్లింప్స్ చూస్తుంటే మంత్రాలతో మూసివేయబడిన ఒక పాత మహల్‌లోకి హీరో తన అనుచరులతో కలిసి వెళ్లిన అనంతరం ఆ మహల్‌లో ఏం జరిగిందనేది ఈ సినిమా అని తెలుస్తుంది. గ్లింప్స్‌లో చూపించిన సీన్స్ చూస్తుంటే ఉత్కంఠభరితంగా ఉండబోతోందని తెలుపుతున్నాయి. పూర్తిగా కొత్త కథాంశంతో తెరకెక్కుతున్న ఈ సినిమా చిత్రీకరణ శరవేగంగా జరుగుతుందని.. బెల్లంకొండ సాయి శ్రీనివాస్ కెరీర్‌లో ఇది ఒక ప్రత్యేకమైన సినిమాగా నిలవనుందని చిత్రబృందం తెలిపింది. ఈ సినిమాను ఆగస్టు లేదా సెప్టెంబర్ నెలలో ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం.





# రేసులోనే కేకేఆర్

**ఢిల్లీ క్యాపిటల్స్‌పై 14 పరుగుల తేడాతో గెలుపు**

ఐపీఎల్ ప్లేఆఫ్స్ రేసులో నిలవాలంటే తప్పక గెలవాల్సిన మ్యాచ్‌లో కోల్‌కతా నైట్ రైడర్స్ విజయం సాధించింది. ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరిగిన కీలక మ్యాచ్ లో కోల్‌కతా నైట్ రైడర్స్ జట్టు 14 పరుగుల తేడాతో గెలుపొందింది. ముందగా టాస్ ఓడి బ్యాటింగ్ చేసిన కోల్‌కతా నైట్ రైడర్స్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 204 పరుగులు చేయగలిగింది. అంగ్‌క్రిష్ రఘువంశీ 44 పరుగులతో టాప్ స్కోరర్ గా నిలిచాడు. అనంతరం బ్యాటింగ్‌కు ఢిల్లీ క్యాపిటల్స్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 190 పరుగులు మాత్రమే చేయగలిగింది. ఢిల్లీ జట్టులో డుప్లెసిస్(62), కెప్టెన్ అక్షర్ పటేల్(43) రాణించారు. చివరలో విప్రజ్ నిగమ్(38) పోరాడినా ఫలితం లేకపోయింది. కోల్‌కతా బౌలర్లలో సునీల్ నరైన్ 3 వికెట్లు పడగొట్టగా.. వరుణ్ చక్రవర్తి 2 వికెట్లు తీశాడు. అనుకుల్ రాయ్, వైభవ్ అరోరా, ఆండ్రీ రస్సెల్ తలో వికెట్ తీశారు.

ముందుగా బ్యాటింగ్ చేసిన కోల్‌కతా నైట్ రైడర్స్ బ్యాటర్లు సమిష్టిగా రాణించడంతో నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 204 పరుగులు చేయగలిగింది.. ఓపెనర్లలో సునీల్ నరైన్ 27 పరుగులు చేయగా.. రహ్మానుల్లా గుర్బాజ్ 26 పరుగులు చేశాడు. దాంతో కోల్‌కతా పవర్ ప్లేలో వేగంగా పరుగులు చేయగలిగింది. కోల్ కతా వేగంగా పరుగులు చేస్తున్న సమయంలో ఢిల్లీ బౌలర్ మిచెల్ స్టార్క్ ఈ జోడీని విడదీసి తొలి వికెట్ సాధించాడు. గుర్బాజ్ ఔటైన తర్వాత సునీల్ నరైన్ విప్రజ్ నిగమ్ ఎల్బీగా వెనుదిరిగాడు. ఆ తర్వాత కెప్టెన్ అజింక్యా రహానే(26), అంగ్ క్రిష్ రఘువంశీ(44) అద్భుతంగా ఆడారు. అక్షర్ పటేల్ రహానే, వెంకటేశ్ అయ్యర్(7)లను ఔట్ చేసి కోల్ కతా జట్టును కష్టాల్లోకి నెట్టాడు. అనంతరం రఘువంశీ బౌండరీలతో రెచ్చిపోయి జట్టు స్కోరును 150 దాటించాడు. హాఫ్ సెంచరీగా దగ్గరగా వెళ్లిన రఘువంశీని చమీర పెవిలియన్ కు పంపాడు. రఘువంశీ అజింక్యా రహానే, రింకూ సింగ్(36)లతో కలిసి పార్టనర్ షిప్ ను నెలకొల్పాడు. 18వ ఓవర్ మూడో బంతికి రింకూ సింగ్ ను విప్రజ్ ఔట్ చేశాడు. అనంతరం ఆండ్రీ రస్సెల్(17), పావెల్(5), చివరలో ఆడారు. మిచెల్ స్టార్క్ 20వ ఓవర్లో ఆండ్రీ రస్సెల్ తొలి బంతినే సిక్సర్ బాదాడు. రస్సెల్ సిక్సర్ బాదడంతో కోల్ కతా జట్టు 200 మార్కును దాటింది. ఆ ఓవర్లో మూడో బంతికే పావెల్ ఎల్బీగా వెనుదిరగగా.. నాలుగో బంతికి అనుకుల్ రాయ్(0)ని చమీర డైవింగ్ క్యాచ్ తో పెవిలియన్ కు పంపాడు. ఐదో బంతికి రస్సెల్ రనౌట్ గా వెనుదిరిగాడు. ఈ క్రమంలో కోల్ కతా జట్టు 9 వికెట్లు కోల్పోయి 204 పరుగులు చేయగలిగింది. ఢిల్లీ బౌలర్లలో మిచెల్ స్టార్క్ 3 వికెట్లు పడగొట్టగా.. విప్రజ్ నిగమ్ 2 వికెట్లు తీశాడు. అక్షర్ పటేల్ కూడా రెండు వికెట్లు పడగొట్టగా.. చమీర ఒక వికెట్ తీశాడు.





## పూరి సినిమాలో విజయ్ కుమార్

**బలగం టీవీ, హైదరాబాద్**

డైరెక్టర్ పూరి జగన్నాథ్, మక్కల్ సెల్వన్ విజయ్ సేతుపతి కలిసి చేస్తున్న ప్రతిష్టాత్మక పాన్-ఇండియా ప్రాజెక్ట్‌లో శాండల్‌వుడ్ డైనమో విజయ్ కుమార్ పవర్ ఫుల్ పాత్రని పోషించడానికి సిద్ధమయ్యారు. విజయ్ కుమార్ బ్లాక్ బస్టర్ వీరసింహారెడ్డి తర్వాత చేస్తున్న రెండో తెలుగు సినిమా ఇది. ఈ చిత్రంలో విజయ్ సేతుపతి నెవర్ బిఫోర్ క్యారెక్టర్ కనిపించబోతున్నారు. ఈ చిత్రం తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం హిందీ భాషలలో విడుదల కానుంది. ఈ చిత్రం రెగ్యులర్ షూటింగ్ జూన్ నుంచి ప్రారంభమవుతుంది. పూరి కనెక్ట్ బ్యానర్‌పై పూరి జగన్నాథ్ , చార్మీ కౌర్ నిర్మిస్తున్న ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌లో టబు కీలక పాత్ర పోషించనుంది.